తలంపు ఎక్కడ పుట్టిందో చూసుకోండి. అంతేగాని ఈ శరీరానికి దండలు వేయటం వలన ఏమి వస్తుంది అన్నారు భగవాన్.

చలంగారు ఏమన్నారు అంటే భగవాన్ కుమారస్వామి అవతారమా, ఈశ్వరుని అవతారమా అదంతా నాకు అక్కరలేదు. భగవాన్ ఎవరో నాకు అక్కరలేదు, భగవాన్ ఏమిటో నాకు అక్కరలేదు, భగవాన్ ఎందుకో నాకు అక్కరలేదు. ఆయన దగ్గరనుండి నాకు శాంతి వస్తోంది, కాంతి వస్తోంది. ఆయన దగ్గరనుండి నేను ఏది పొందుతున్నానో అదే నాకు కావాలి. ఆయన ఈశ్వరుని అవతారం, కుమారస్వామి అవతారం అవ్వవచ్చు, కాకపోవచ్చు. ఆయన దగ్గరనుండి నాకు శాంతి, కాంతి వస్తున్నాయి. అదే నాకు కావలసింది అన్నారు చలంగారు. రమణచత్వారింశత్ చదవటం వలన మీకు రమణస్వామి మీద గౌరవం, భక్తి పెరుగుతుంది. నీటిలో ఉప్పుకరిగినట్లు ఆ భక్తి అనే గంగలో మన అహంకారం కరుగుతుంది. అందుకే భక్తి. భక్తే నిజమైన సొమ్ము. కొంతమంది ఎంత కష్టపడి చదువుకొంటారో, ఎంత కష్టపడి ధనం సంపాదించుకొంటారో అలాగే కొంతమంది అంత కష్టపడి భక్తిని సంపాదించుకొంటారు, వారు ధన్యులు.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 19-07-2016, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఓం నమో భగవతే వేదవ్యాసాయ. ఈ రోజు వ్యాసపూర్ణిమ. అంటే వ్యాసుడు పుట్టినరోజు. ఈరోజున ఎవరి గురువును వారు దర్శించి, కృతజ్ఞత తెలియచేయటానికి ఈ వ్యాసపూర్ణిమను గురుపూర్ణిమగా మన పెద్దలు నిర్ణయించారు. చాలామందికి భక్తుల విలువ తెలియటంలేదు. అసలు మన భారతీయ సాహిత్యాన్ని పెంచిన వాళ్లందరూ భక్తులే. వాల్మీకి, వేదవ్యాసుడు తరువాతకాలంలో పోతనామాత్యుడు వీళ్లందరూ మహాభక్తులే. వాల్మీకి రాసిన రామాయణం ఎంతో మధురంగా ఉంటుంది. అలాగే వ్యాసుడు భారతం, భాగవతం రచించి ఎంతో సాహిత్యాన్ని ప్రసాదించాడు. ఆధ్యాత్మికంగా అభివృద్ధి పొందిన వారు భౌతికాన్నికూడా ఆధ్యాత్మికంగానే చూస్తారు. వారు మన వంక చూసినా వారికి చైతన్యభావన తప్పించి ఏమీ ఉండదు. మనం అందరం చైతన్యంలోనే ఉన్నాము కాని వచ్చిన చిక్కు ఏమిటి అంటే మనం చైతన్యంలోనే ఉన్నాము అనే అనుభవం మనకు లేదు. లోపల చైతన్యం, బయట చైతన్యం, లోపల శాంతి, బయట శాంతి అంతటా వ్యాపించి ఉన్నది ఒక్కటే. అదే చైతన్యం. ప్రతీ వ్యక్తీ చైతన్యంలోనే ఉన్నాడు, చైతన్యానికి భిన్నంగా ఎవరూ లేరు.

ప్రతీమానవుడికి సుఖం కావాలి, శాంతికావాలి. అయితే ఆ సుఖం ఎక్కడ ఉంది, దేనిని పొందితే శాంతిని పొందుతారు అనేది మీకు తెలియటంలేదు. ఈ ప్రపంచంలో ఉన్న టెంపరరీ ప్లెజర్స్‌తో మీరు ఆగిపోతున్నారు. వీటివలన పరిణామంలో మీకు దుఃఖం వస్తుంది. మీరు పెర్మనెంట్‌గా శాంతి స్థానంలో ఉండాలి అంటే మీ హృదయంలో ఒక నిజం ఉంది, దానిని మీరు తెలుసుకోవాలి. దానికి చావుపుట్టుకలకు ఏమీ సంబంధంలేదు, అది స్వతంత్ర మైనది. దానిని అనుభవంలోనికి తెచ్చుకోవటమే మీ జీవితగమ్యం. మీరు సుఖంకోసం, శాంతికోసం ప్రపంచంలో వెదుకుచున్నారు. ప్రపంచంలో సుఖం లేదు, శాంతి లేదు. అది మీ హృదయంలోనే ఉంది. లేనిచోట వెదికితే అది దొరకదు. ఉన్నచోట వెదకండి. ఈ రోజు కాకపోయినా రేపు అయినా మీకు దొరుకుతుంది. అందుచేత మీరు మనస్సును అంతర్ముఖం చేయండి. ద్వేషాలు విడిచిపెట్టండి. తోటి మానవుడికి మైత్రీభావన, ఆప్యాయతలను పంచిపెట్టండి. మీరు ఇతరులపట్ల ఆప్యాయతగా ఉండాలి కాని ద్వేషభావన ఉండకూడదు. మీ ఇంట్లో కుటుంబసభ్యులు ఉన్నారు. పూర్వజన్మలో వారికి మీకు ఏదో అనుబంధం ఉంది కాబట్టి ఒకే కుటుంబంలోనికి వచ్చారు. వారిపట్ల మన డ్యూటీ ఏదో మనం చెయ్యాలి. కొంతమంది ఇంట్లో ఉన్న ముసలి వారిని చాలా జాగ్రత్తగా చూసుకొంటారు. వారిని గౌరవంగా చూడటం వలన, ఆప్యాయతగా చూడటం వలన మీ మనస్సు బాగుపడుతుంది. వారికి పనిచేసుకొనే శక్తి లేనప్పుడు మనం వారిని చూడవలసి ఉంటుంది. అటువంటప్పుడు వారిని ప్రేమగా చూడటం వలన మీకు ఈశ్వరుని దయ కలుగుతుంది. ఎందుచేతనంటే వారిలో అంతర్యామిగా ఉన్నవాడు ఈశ్వరుడే. మనం ఎవరికయినా భోజనం పెడితే ఎవరికో ఎల్లయ్యకు పెట్టాము, పుల్లయ్యకు పెట్టాము అనుకొంటాము. అలాకాదు. లోపల అంతర్యామిగా ఉన్నవాడు ఈశ్వరుడే. మీరు ఎవరికి ఏది ఇచ్చినా అది ఈశ్వరుడే తీసుకొంటున్నాడు. గివర్ ఆయనే, టేకర్ ఆయనే, అంతా ఈశ్వరుడే. మనం ఎవరికి అయినా ఏదయినా సహాయం చేస్తే ఏదో త్యాగం చేసేశాము అనుకొంటాము. ఇందులో త్యాగాలు ఏమీ లేదు. ఇక్కడ రమణ మహర్షిగారు చక్కటి వాక్యం చెప్పారు. నువ్వు ఇతరులకు ఏది యిచ్చినా అది తిరిగి నీకే వచ్చేస్తుంది అన్న సంగతి నీకు తెలియకపోవటం వలన నేను ఏదో త్యాగం చేసాను అని నువ్వు అనుకొంటున్నావు. నువ్వు చేసే త్యాగం ఏమీ లేదు.

సాధన పేరుమీద జనరల్‌గా కొంత సఫరింగ్ ఉంటుంది. సాధన పేరుమీద నీకు ఎక్కువ సఫరింగ్ లేకుండా నిన్ను ఒడ్డుకు తీసుకొనిపోవటానికి భగవాన్ ప్రయత్నం చేసారు. శాంతి అనేది, సుఖం అనేది నీలోపలే ఉంది కాని బయట ఏమీ లేదు. శాంతికోసం, సుఖం

కోసం మీరు బయట వ్యక్తుల మీద కాని, వస్తువులమీద కాని ఎక్కడ ఆధారపడినా మరల అదంతా దుఃఖంగా మారిపోవును. ఈ జన్మలో కాకపోయినా, రాబోయే జన్మలో అయినా అది అంతా దుఃఖంగా మారిపోతుంది. మనకువచ్చే తలంపుల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. వేదవ్యాసుడు ఏమని చెప్పాడు అంటే "అటుచూసినా, ఇటుచూసినా, ఎటుచూసినా ఆకాశంవైపుకు చూసినా మంచి తలంపులు, చైతన్యస్థాయి పెరిగే తలంపులు నాకు వచ్చుగాక అని ఆశీర్వదించు ఈశ్వరా!" అని ఒక వేదంలో చెప్పాడు. ఇది వేదవాక్యం. ఎటుచూసినా, నేను సమాజం మధ్యలో ఉన్నా, ఇంట్లో ఒంటరిగా ఉన్నా మంచిపనులు చేసే తలంపులు, మంచి ఊహలు, మంచి సంకల్పాలు, జీవితంలో భౌతికంగా ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి రావటానికి ఉపయోగపడే తలంపులు నాకు ప్రసాదించు అని వ్యాసుడు చెప్పాడు. లెట్ నోబుల్ తాట్స్ కమ్ టు అజ్ ఫ్రమ్ ఎవ్వరిసైడ్. ఈ వాక్యాన్ని మీరు మననం చేసుకోండి. తలంపులు చాలా ముఖ్యం. తలంపును బట్టి మాటవస్తుంది, తలంపునుబట్టి పనిచేస్తాము. మీరు పని చేసేటప్పుడు మీ పనిని భగవంతుడు చూడడు. ఆ పని చేసేటప్పుడు మీరు హృదయంలో ఎలా ఉన్నారు అనేది భగవంతుడు చూస్తాడు. మీలో మంచి గుణాలు ఉన్నా, మీలో సహృదయం ఉన్నా మీ పట్ల నాకు ద్వేషం ఉంటే ఆ మంచితనాన్ని నా మనస్సు అందుకోలేదు. నాలో ఉన్న సహృదయాన్ని ఎవరూ అర్థం చేసుకోవటం లేదు అని మీరు కూడా అనుకోకూడదు. అలా అనుకొంటే మీలో అజ్ఞానం పెరుగుతుంది, వ్యక్తిభావన పెరుగుతుంది. మీకు ఉన్న ఆప్యాయత ఎవరో కొంత మంది వ్యక్తులకు పరిమితంఅవ్వకూడదు, సామాజికంగా ఉండాలి.

నువ్వు చేసే సాధనల కంటే సజ్జనసాంగత్యం చాలా మంచిది. చైతన్యస్థాయిలో మీకంటే అభివృద్ధిలో ఉన్నవారితో మీరు సహవాసం చేయుటం వలన వాళ్ల శక్తి మీకు ఉపయోగపడు తుంది. వాడి హృదయంలో ఉన్న నిజాన్ని ఎవడయితే దర్శించాడో వాడి సమక్షంలో మీరు ఉండటం వలన మీ హృదయంలో ఉన్న నిజం మీకు ఎఱుకలోనికి వచ్చే అవకాశం ఉంది. లోపల సత్యదర్శనం పొందినవారితో సహవాసం వలన, వారి సమక్షంలో జీవించటం వలన వాళ్ళు ఏ సత్యాన్ని అయితే దర్శించారో అది మీ హృదయంలో మీకు గోచరిస్తుంది. లోపల నీకు సుఖంలేనప్పడు, శాంతి లేనప్పడు, చైతన్యస్థాయిని నువ్వే అందుకోలేనప్పడు నువ్వు ఏదయినా మాటలు చెప్పినా, పుస్తకాలు చదివి చిలుకపలుకులు పలికిన వాటి వలన ఏమి ప్రయోజనం ఉండదు. అలాగని మిమ్మల్ని మాట్లాడవద్దని కాదు. అవుటాఫ్ ప్యూరిటీ అండ్ సైలెన్స్ కమ్స్ ద వర్డ్ ఆఫ్ పవర్. మీటింగులో అల్లరిగా ఉంటే డోంట్ మేక్ నాయిస్ అని

చెప్పేవాడు కాదు బాపూజీ, ఊరికే చేత్తోటి ఇలా అనేవాడు అంతే కీప్ క్వయిట్. వాళ్ళ ఆప్యాయత ఏదో వ్యక్తులకు పరిమితం కాదు. సృష్టి ఎంత విశాలంగా ఉందో వాళ్ళకు ఉన్న ఆప్యాయత కూడా అంత విశాలంగా ఉంటుంది. చెయ్యి ఇలా అంటే సభ అంతా నిశ్శబ్దం, ఆశక్తి ఎక్కడ నుండి వచ్చింది. నీలో పవిత్రత ఉంటే, నిజంగా నువ్వు సమాజం కోసం పనిచేస్తూ ఉంటే, నీకు సహృదయం ఉంటే నీ హృదయంలో నుండే శక్తి వస్తుంది. బయట ఏదో ఉంది అని మనం అనుకొంటాము కాని అసలు బయట ఏమీ లేదు. వెన్నెల వలన తాపం తగ్గుతుంది, కల్పవృక్షం వలన దరిద్రం తగ్గుతుంది. గంగాజలంలో స్నానం చేస్తే పాపం తగ్గుతుంది. ఒక సత్పురుషుడు యొక్క దర్శనం చేస్తే మొత్తం యివన్నీ జరుగుతాయి అంటే సత్పురుషుడి దర్శనం వల్ల ఇన్ని లాభాలు పొందుతాము.

నిజమైనగురువు మన హృదయంలోనే ఉన్నాడు. లోపల హృదయంలో ఉన్న నిజాన్ని ఎవడయితే దర్శించాడో వాడి ద్వారా శాంతి తరంగాలు, కాంతి తరంగాలు ప్రపంచం అంతా వ్యాపిస్తాయి. మల్లెపూవు ఉంటే సువాసనరాకుండా ఎలా ఉంటుంది, కొండమీద దీపం పెట్టి ఎవరికీ కనబడకూడదు అంటే ఎలా కుదురుతుంది. అలాగే ఎవడయితే హృదయం యొక్క లోయలోనికి వెళ్ళాడో, ఎవడయితే హృదయంలో ఉన్న సత్యాన్ని దర్శించాడో వాడు గుహలో ఉన్నా, సమాజం మధ్యలో ఉన్నా, ఇంటిలో ఉన్నా వాడిదగ్గర నుండి సమాజానికి కాంతి తరంగాలు, శాంతితరంగాలు ప్రవహిస్తూ ఉంటాయి. నువ్వు సత్యానుభవం పొందితే నీ ప్రభావం సమాజంమీద ఉంటుంది. నీ హృదయంలో ఉన్న సత్యం తాలూకు అనుభవం లేకుండా ప్రసంగాలు చెప్పినా పెద్ద ప్రయోజనం ఉండదు. సత్యం గురించి తెలియని వాడు మాట్లాడుతూ ఉంటే విషయం గ్రహించటం నీకు కష్టం అవుతుంది. ఆత్మానుభవం పొందిన వారి సమక్షంలో పది నిమిషాలు కూర్చొన్నా దాని ప్రభావం నీ మీద ఉంటుంది. ఆయన నీతో ఒక్క మాట మాట్లాడకపోయినా అవసరాన్ని బట్టి నీకు కావలసింది ఏదో ఆయన దగ్గరనుండి అందుతూ ఉంటుంది. అక్కడ మాటలతో పనిలేదు, తలంపులతోటి పనిలేదు. వీటి అన్నింటికీ అతీతంగా అది ఉంది. అందులోనుండి నీకు అందవలసింది అందుతూనే ఉంటుంది. ఆయనప్రజలలోకి రాకపోయినా, నీ సన్నిధికి రాకపోయిన ఏ నాగలక్ష్మి గారినో, ఎవరినో ఉపయోగించుకొని వారి ద్వారా మీకు ఇవ్వవలసిన సందేశం అందిస్తూ ఉంటారు. మెసేజ్ అందజేయటంకోసం ఇతరులను ఉపయోగించుకొంటూ ఉంటారు.

అసూయలు ఎలా ఉంటాయి అంటే అశోకుడు మహారాజు, ఆయన ప్రజలను విపరీతంగా ప్రేమిస్తాడు. అశోకుడు, ఆయన సంతానం బుద్ధుడి సందేశాన్ని వ్యాప్తి చేస్తూ ఉంటే అశోకుడి

భార్యకు భర్తమీద, పిల్లలమీద విపరీతమైన ద్వేషం వచ్చేసింది. బుద్ధుడి గురించి నా భర్త, పిల్లలు నాకు దూరమయిపోతున్నారు అని ఆవిడకు కక్ష వచ్చేసింది. ఆవిడకు అసలు అవగాహన లేదు. అశోకుడు గాని , పిల్లలుగాని ఇల్లు విడిచిపెట్టలేదు. ఆవిడకు ఇచ్చే గౌరవం ఆవిడకు యిస్తున్నారు. కాని వీళ్ళు మనకేదో దూరమయిపోతున్నారు అనే భావనవచ్చి, ఆకక్ష తీర్చుకోవటానికి భర్తని పిల్లలను ఏమీచేయలేక బుద్ధుడు తపస్సు చేసిన చెట్టును నరికించేసింది. ఇదంతా అవగాహన లోపం. భగవంతుడు, అనుగ్రహం, గురువు, దయ అన్నీ ఒక్కటే. ఇవన్నీ పర్యాయ పదాలు. నన్ను లండనర్స్ చైల్డ్ ఆఫ్ భగవాన్ అని పిలిచేవారు. మనం పెద్దపెద్దసాధనలు చేయలేదు, పెద్దపెద్ద చదువులు చదువలేదు, హిమాలయ పర్వతాలకు వెళ్ళలేదు. ఈ స్టేజిమీద కూర్చోబెట్టి ఇలా మాట్లాడించేది కూడా భగవాన్ దయ, భగవాన్ యొక్క ప్రేమ. ఈ స్టేజిమీద మేము నాలుగు మాటలు చెపుతున్నాము అంటే ఇది భగవాన్ అనుగ్రహమే.

అరుణాచలంలో ఉన్న కొండ గురించి బ్రంటన్ ఏమి చెప్పాడంటే దీనిని కొండకొండ అంటున్నారు. ఈ కొండ అనే పేరు మార్చేసి దీనికి ప్రేమ అని పేరు పెడదాము. అది మన శరీరాన్ని ఏమీ చంపదు. మనలోపలనుండి నేను నేను అనే తలంపు వస్తోంది కదా ఆ నేను అనే తలంపును చంపేస్తుంది. ఈ కొండ ఏమి చేస్తుంది అంటే నీ దేహాన్ని చంపదు, నీ లోపల ఉన్న దేహభావనను చంపేస్తుంది. ఇది మాట్లాడదు. ఇదంతా కూడా ఈ కొండ మౌనంలోనే చేసేస్తుంది. ఈ కొండకు అంత శక్తి ఉంది. అందుచేత మనం ఈ కొండను కొండ అని పిలవవద్దు, దీనికి ప్రేమ అనే పేరు పెడదాము అన్నాడు బ్రంటన్. సత్యం నీ హృదయం లోనే ఉంది. గురువు చేసే పని ఏమిటి అంటే నీ హృదయంలో ఉన్న సత్యాన్ని నీకు ఎఱుక పరుస్తాడు, అది ఎక్కడో బయట నుండి వచ్చేదికాదు. మన హృదయం, మాట, చేత ఒక్కటిగా ఉండాలి. అప్పుడు ఈశ్వరుని దయ మనకు కలుగుతుంది. మీరు సాధన ఎలా చేస్తున్నారు అని నేను ఒక ముసలమ్మగారిని అడిగాను. నాన్నగారు మన అహంకారం సాధన ఏమి చేస్తుంది. వచ్చేది అంతా అక్కడ నుండి రావాలి. ఏది వచ్చినా ఈశ్వరుడి దగ్గరనుండే రావాలి కాని మన అహంకారం వలన ఏమీ రాదు అని చెప్పారు. బుద్ధుడు ఈ దేశం అంతా ఎందుకు తిరిగాడు. వాడు ఏ సుఖాన్ని, శాంతిని పొందుతున్నాడో, ఏ నిర్వాణసుఖాన్ని అయితే ఆయన పొందాడో ఆయన పొందిన శాంతిని, సుఖాన్ని ప్రపంచానికి పంచిపెట్టటానికి తిరిగాడు, కాని అంతకంటే ప్రయోజనం ఏమీ లేదు. వారు పొందిన ఆనందాన్ని మీకు పంచిపెట్టటానికి, మీకు జ్ఞానభిక్ష పెట్టి మిమ్మల్ని దుఃఖంలేని స్థితికి తీసుకొనిపోవటానికి వారి జీవితాలను బలిపెట్టారు.